సర్కారు బడుల్లో అభివృద్ధి ఘనం

- నాడు భవనాలు శిథిలం.. నేడు సుందరం
- ఆధునిక మౌలిక వసతుల ఏర్పాటు
- పేద విద్యార్థుల చదువులకు జగనన్న భరోసా
- పెరిగిన హాజరు శాతం.. తగ్గిన డ్రాపవుట్స్

భీమడోలు: నాణ్యమైన విద్యను పేద విద్యార్థుల చెంతకు చేర్చి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలన్న ఏకైక సంకల్పంతో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ బడుల రూపురేఖలు మార్చడమే లక్ష్యంగా మన బడి, నాడు- నేడు పథకాన్ని అమలు చేశారు. కనీస వసతుల కరువై రూపురేఖలు కోల్పోయిన సర్కారు బడులకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి జవసత్వాలు ఇచ్చారు. పిల్లలకు మనం అందించే ఆస్తి ఏదైనా ఉంది అంటే అది చదువే అని నమ్మిన సీఎం జగన్ సర్కారు బడులను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్ది దేశానికి ఆదర్శకంగా నిలిచారు. విద్యారంగంలో ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు సత్ఫలితాలిస్తున్నాయి. విద్యారంగంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు మన బడి నాడు-నేడు కార్యక్రమంలో సర్కారీ బడుల రూపురేఖలు మారాయి. భీమడోలు మండలానికి రూ.కోట్ల నిధులను వెచ్చించి శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ పాఠశాల స్థానంలో నూతన భవనాలను నిర్మించారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థులను ఆకర్షించేలా తరగతులు రూపుదిద్దుకున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాపవుట్స్ రేటును తగ్గించాలని ప్రభుత్వం నాడు-నేడు పథకాన్ని తీసుకొచ్చింది. ఉంగుటూరు నియోజకవర్గంలో ప్రతి పాఠశాల నేడు సుందరంగా మారాయి.


ఆహ్లాదకరమైన వాతావరణంలో ఎంఎంపురం ఉన్నత పాఠశాల


నేడు - అన్నేవారిగూడెంలో డిజిటల్ విద్యాబోధన చేస్తున్న హెచ్‌ఎం ఎస్‌కే మస్తాన్


నాడు - భీమడోలు- 4 పాఠశాల


నేడు - భీమడోలు- 4 పాఠశాల

ఉంగుటూరు నియోజకవర్గం వివరాలు

మండలం	విద్యార్థులు	అభివృద్ధి చెందిన పాఠశాలలు	కేటాయించిన నిధులు(రూ.కోట్లు)
భీమడోలు	4800	36	5.20
ఉంగుటూరు	5663	65	5.82
నిడమర్రు	2910	40	4.22
గణపవరం	8600	56	5.73

ఐఎఫ్ ప్యానల్ బోర్డులపై చిత్రాల ద్వారా పాఠ్యాంశాల బోధన

చిత్రాలను చూపుతో చిన్నారులకు పాఠ్యాంశాలను బోధిస్తే మెరుగైన ఫలితాలు వస్తాయని భావించిన ప్రభుత్వం ఐఎఫ్ ప్యానల్ బోర్డులను ఏర్పాటు చేసింది. పాఠశాల గోడలపై విజ్ఞానదాయకమైన క్రీడలు, యోగా, పరిశుభ్రత తదితర అంశాలకు చెందిన బొమ్మలు రూపొందించారు. నూతన విధానాలు, పథకాల అమలు కారణంగా విద్యార్థుల హాజరుశాతం పెరిగి డ్రాపవుట్స్ తగ్గారు. దీనితో పాఠశాలలు విద్యార్థులతో కళకళలాడుతున్నాయి.

సమకూరిన సౌకర్యాలు

పాఠశాలలను అన్ని హంగులతో అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం 9 రకాల మౌలిక వసతులను కల్పిస్తోంది. వాటిలో టాయిలెట్ల నిర్మాణం, ఫ్యాన్లు, విద్యుదీకరణ, తాగునీటి సరఫరా, విద్యార్థులు, టీచర్లకు ఫర్నీచర్, పాఠశాలలకు పెయింటింగ్, మైనర్, మేజర్ మరమ్మతులు, ఆకుపచ్చ సుద్ద బోర్డులు, ఇంగ్లీషు ల్యాబ్స్, పాఠశాలల చుట్టూ ప్రహరీ నిర్మిస్తున్నారు. సురక్షిత తాగు నీటిని అందించేందుకు ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఉన్నత పాఠశాలలకు రూ.5 లక్షలు, ప్రాథమిక పాఠశాలలకు రూ.1.8 లక్షలు మంజూరు కావడంతో మౌలిక వసతులు ఏర్పాటయ్యాయి.


నాడు - అన్నేవారిగూడెం యూపీ పాఠశాల


సుందరంగా తీర్చిదిద్దిన భీమడోలు- 1 పాఠశాల


ఆకర్షణీయంగా గుండుగొలను -1 పాఠశాల ముఖ ద్వారం

ఐఎఫ్ ప్యానల్ బోర్డులపై విద్యాబోధన



జగన్ మామయ్య మాలాంటి పేద విద్యార్థులు చదువుకుంటున్న ప్రభుత్వ బడులను అభివృద్ధి చేసి అన్ని సౌకర్యాలు కల్పించి మాకు అండగా నిలిచారు. ప్రతి రోజు దుద్దేపూడి నుంచి అన్నేవారిగూడెం పాఠశాలకు వస్తాను. ఐఎఫ్ ప్యానల్ బోర్డులపై ఉపాధ్యాయులు చక్కగా విద్యబోధన చేస్తున్నారు. సైన్సు ప్రయోగాలను డిజిటల్ బోర్డులపై వివరిస్తున్నారు.

– కుంచన వాషిక, 8వ తరగతి, దుద్దేపూడి

ఉన్నత స్థితికి చేరుకునేందుకు దోహదం



నాడు-నేడు పథకంలో రెండు దశల్లో రూ.35లక్షలతో మా పాఠశాలలో అదనపు తరగతి గదితోపాటు డిజిటల్ క్లాస్ రూమ్‌ను నిర్మించారు. మౌలిక వసతులను సమకూర్చారు. విద్యార్థుల హాజరు పెరిగింది. డ్రాపుట్స్ తగ్గారు. ప్రభుత్వలక్ష్యం నెరవేరుతుంది. 8,9 తరగ తి గదులకు బాలబాలికలకు ట్యాబ్‌ను అందింబా రు. పిల్లలు ఉన్నత స్థితికి చేరుకోవడానికి ఈ తరహా విద్య ఎంతగానో దోహద పడుతుంది.

– ఎస్‌కే మస్తాన్, హెచ్‌ఎం, యూపీ పాఠశాల, అన్నేవారిగూడెం

పాఠశాలల్లో ఆహ్లాదకర వాతావరణం



నాడు-నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందాయి. రెండుదశల్లో 36 పాఠశాలలను రూ.5.20కోట్ల నిధులతో అభివృద్ధి చేశారు. పాఠశాలలు సర్వాంగ సుందరంగా సిద్ధమయ్యాయి. మెరుగైన విద్యాబోధన అందుబాటులోకి రావడంతో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల వైపు ఆకర్షితులవుతున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు ఆహ్లాదకరమైన వాతావరణంలో అన్ని సదుపాయాలతో సాంకేతిక విద్యను రంగరించుకుని భవిష్యత్తు తరానికి దీటైన విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. రెండో దశ పనులు దాదాపు పూర్తి కావస్తున్నాయి.

– అయినపర్తి భాస్కర్‌కుమార్, ఎంఈవో, భీమడోలు

క్లుప్తంగా

పద కవితా పితామహుడు అన్నమయ్యకు నివాళులు


గుండుగొలనులో అన్నమయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

భీమడోలు: గుండుగొలనులోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమయ్య వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని అన్నమయ్య విగ్రహానికి అభివృద్ధి కమిటీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నేత వగ్వాల అచ్యుతరామారావు, పెద్దలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తొలుత విగ్రహానికి పూజలు చేసారు. తెలుగు సాహితీ చరిత్రలో లభించిన ఆధారాల ప్రకారం అన్నమయ్య తొలి వాగ్గేయకారుడన్నారు. దక్షిణాపథంలో భజన సంప్రదాయానికి పద కవితాశైలికి అన్నమయ్య ఆద్యుడని, గొప్ప వైష్ణవ భక్తుడు అన్నారు. జనాల్లో ఆయన పాటలు నాటుకుపోయాయన్నారు. ఈ కార్యక్రమంలో పూజారి మంగపతి అచార్యులు, పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

సంపూర్ణ పోషణ కిట్లు అందజేత

ఏలూరు రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం పేదలను ఆరోగ్యవంతులను చేస్తుందని కోటేశ్వరదుర్గాపురం సర్పంచ్ వర్రీ లక్ష్మీదుర్గ అన్నారు. ఏలూరు రూరల్ మండలం కోటేశ్వరదుర్గాపురంలో శుక్రవారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన పిల్లలతోనే సమాజం అభివృద్ధి బాట పడుతుందన్నారు. దీన్ని గుర్తించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బాలింతలు, గర్భిణులు, చిన్నపిల్లలకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ చొక్కాపు లక్ష్మీ, ఆయా గండి కనకదుర్గ, నాయకులు వర్రీ నారాయణ పాల్గొన్నారు.

ఆటో, క్యాబ్‌లపై విధించిన ఈ-చలానాలు రద్దు చేయాలి

ఏలూరు (టూటౌన్): ఆటో, క్యాబ్ వాహనాలపై విధించిన ఈ-చలానాలను రద్దు చేయాలని, అస్తవ్యస్తంగా ఏర్పాటు చేసిన స్టాప్ లైన్ సీసీ కెమెరాలు నిలిపి వేయాలని ఆలిండియా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహ్మద్, జిల్లా కార్యదర్శి జె.గోపి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.సోమయ్య కోరారు. స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లోని ఆటో, క్యాబ్ వాహనాల డ్రైవర్ల రిలే నిరసన దీక్షా శిబిరాన్ని శుక్రవారం వారు సందర్శించారు. రెండవ రోజు రిలే నిరాహార దీక్షలను డ్రైవర్లకు నిమ్మరసం ఇచ్చి ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ సుందరయ్య, సీపీఎం పార్టీ ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో మైత్రి క్యాబ్ డ్రైవర్స్ యూనియన్ నాయకులు బండారు శ్రీనివాస్, పి.శ్రీనివాస్, పీఎన్ ప్రసాద్, ఆటో యూనియన్ నాయకులు ఆంజనేయులు, పాపినాయుడు పాల్గొన్నారు.

రైతులపై దాడులు అమానుషం

ఏలూరు (టూటౌన్): ఢిల్లీ సరిహద్దుల్లో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతులు చేస్తున్న ఆందోళనలపై కేంద్రంలోని మోదీ ప్రభుత్వం హర్యానాలోని బీజేపీ ప్రభుత్వం ఈనెల 21న అమానుషంగా చేసిన పోలీసుల దాడులలో ఒక యువ రైతు మరణించడంపై కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం బ్లాక్ డే నిర్వహించారు. స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్లో ఏఐటీయూసీ, సీఐటీయూల నాయకులు ఆధ్వర్యం వహించారు. కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా ఏలూరులో బ్లాక్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస డాంగే, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.సోమయ్య అధ్యక్షతన ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.కృష్ణమాచార్యులు, సీఐటీయూ ఏలూరు నగర అధ్యక్షుడు బి.జగన్నాథం, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడారు. రైతులపై దాడులను వారు ఖండించారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ పాల్గొన్నారు.

2న ప్రత్యామ్నాయ సంస్కృతి మేళా

ఏలూరు (టూటౌన్): మార్చి 2న గుంటూరులో నిర్వహించనున్న ప్రత్యామ్నాయ సంస్కృతి మేళాను జయప్రదం చేయాలని నవసమాజ్ సొసైటీ చైర్మన్ నేతల రమేష్ బాబు పిలుపునిచ్చారు. స్థానిక నవసమాజ్ సొసైటీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన దళిత బహుజన నాయకుల సమావేశంలో నేతల రమేష్ బాబు మాట్లాడారు. ఏపీ దళిత మహాసభ అధ్యక్షుడు డాక్టర్ కత్తి పద్మారావు ఆధ్వర్యంలో గుంటూరు వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో మార్చి 2వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించనున్న ప్రత్యామ్నాయ సంస్కృతి మేళాను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ప్రత్యామ్నాయ సంస్కృతి మేళా కరపత్రాలను ఆవిష్కరించారు. భూపతి అప్పారావు, ఎల్‌ఐసీ రాజు, కొత్తల పూర్ణ మల్లికార్జునరావు, అర్జి అవినాష్ పాల్గొన్నారు.

అచ్చమ్మ పేరంటాల తల్లిని దర్శించుకున్న జెడ్పీ చైర్‌పర్సన్

దెందులూరు: గాలాయిగూడెంలోని అచ్చమ్మ పేరంటాల తల్లి ఆలయ అభివృద్ధి, గ్రామ అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. చైర్‌పర్సన్ పద్మశ్రీ, ఏపీ ఆయిల్ ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు, ఏలూరు పార్లమెంటరీ ఇన్‌చార్జి కారుమూరి సునీల్ కుమార్, జెడ్పీటీసీ నిట్టా లీలా నవకాంతం ధనరాజు, కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఎం.కొండలరావు, పార్టీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని శుక్రవారం అచ్చమ్మ పేరంటాల తల్లి ఉత్సవాలకు హాజరై అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. తొలుత వారికి ఆలయ కమిటీ, అర్చకులు ఘన స్వాగతం పలికి, సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా కొఠారు రామచంద్రరావు, కారుమూరి సునీల్ కుమార్ మాట్లాడుతూ ఉభయ రాష్ట్రాల్లో అచ్చమ్మ పేరంటాల తల్లి ఉత్సవాలకు ఎంతో ఆదరణ ఉందన్నారు. అమ్మవారి ఉత్సవాల్లో పాల్గొనడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు, ఎంపీటీసీ సొంగా ప్రమీళా రాణి, ఆలయ కమిటీ సభ్యులు, పలువురు ప్రజాప్రతినిధులు ఉన్నారు.


మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, కొఠారు రామచంద్రరావు, కారుమూరి సునీల్ కుమార్

అచ్చమ్మతల్లికి పూజలు

దెందులూరు: గాలాయగూడెం అచ్చమ్మ పేరంటాలమ్మ ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం దెందులూరు తహసీల్దార్ వి.జితేంద్ర అమ్మవారి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు తహసీల్దార్‌కు స్వాగతం పలికి, జ్ఞాపికను అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో గాలాయగూడెం వీఆర్వో వీ.విష్ణుమూర్తి ఉన్నారు.

పోతునూరు పంపు హౌస్ ఆధునీకరణకు వితరణ

దెందులూరు: దివంగత కేంద్ర మంత్రి పర్వతనేని ఉపేంద్ర పోతునూరు వాసి కావడంతో ఆయన కుమారుడు, ఉపేంద్ర ట్రస్టు కార్యదర్శి పీ.వివేక్ ఆనంద్ గ్రామంలో పంపు హౌస్ ఆధునీకరణకు రూ. 5 లక్షలు అందజేశారు. గ్రామానికి చెందిన కొమ్మారెడ్డి వెంకటరత్నం ఆధ్వర్యంలో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. గతంలో పర్వతనేని ఉపేంద్ర నెదర్లాండ్ ప్రభుత్వం సహకారంతో మన దేశంలో కేవలం రెండు పంపు హౌస్‌లు ఏర్పాటుకు ఆయన కృషి చేశారు. ఒకటి మహారాష్ట్రలోని బిశ్వాడీ గ్రామం, రెండోది ఆంధ్రప్రదేశ్‌లోని పోతునూరు గ్రామం. ప్రస్తుతం ఆ పంపు హౌస్ శిథిలావస్థకు చేరడంతో ఆధునీకరణకు ఆయన కుమారుడు రూ.5 లక్షల విరాళం అందజేశారు. ఈ పనులను సర్పంచ్ బోదుల స్వరూప్, ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, వైఎస్సార్ సీపీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు గూడపాటి పవన్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు.


పోతునూరులోని పంపు హౌస్

కొవ్వలి ఉన్నత పాఠశాలలో అభివృద్ధి పనుల పరిశీలన

దెందులూరు: కొవ్వలి ఉన్నత పాఠశాలలో పీఎం శ్రీ పథకంలో రూ.5 లక్షలతో అభివృద్ధి చేస్తున్న ఆట స్థలాన్ని సమగ్ర శిక్ష అదనపు పథక సమన్వయ కర్త బి. సోమశేఖరరావు శుక్రవారం తనిఖీ చేశారు. ఆట స్థలానికి ఉపయోగిస్తున్న గ్రావెల్, వర్షం నీరు బయటకు పోవడానికి నిర్మిస్తున్న డ్రెయినేజీని ఆయన పరిశీలించారు. రూ.10 లక్షలతో నిర్మించిన నూతన గ్రంథాలయాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జగనన్న గోరు ముద్దు ఆహారం నాణ్యత, అకడమిక్ కార్యక్రమాలను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు అందించిన ట్యాబ్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో అకడమిక్ మోనిటరింగ్ ఆఫీసర్ రెడ్డి రామారావు, రాష్ట్ర అసిస్టెంట్ సహిత విద్యా సమన్వయ కర్త రాధిక, రాష్ట్ర కోఆర్డినేటర్ కిషోర్, కొవ్వలి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శర్మ, పీడీ సురేష్ ఉన్నారు.


కొవ్వలి ఉన్నత పాఠశాలలో పీఎం శ్రీ పథకం అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న సోమశేఖరరావు

26న అండర్ పాస్ ప్రారంభోత్సవం

దెందులూరు: దశాబ్దాలుగా వేలాది మంది ప్రయాణికులకు తీరని సమస్యగా ఉన్న దెందులూరు- అలుగులగూడెం రైల్వేట్రాక్ గేటు సమస్య పరిష్కారమైంది. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ పలుమార్లు చేసిన విజ్ఞప్తి మేరకు రైల్వేట్రాక్ వద్ద అండర్‌పాస్ సమస్య పరిష్కారమైంది. దెందులూరు – అలుగులగూడెం రైల్వే ట్రాక్ వద్ద నిర్మించిన అండర్ పాస్‌ను ఈ నెల 26న భారత ప్రధాని మోదీ వర్చువల్ విధానంలో ప్రారంభిస్తారని రైల్వే ఏడీ ఈఎస్ గణేశన్ తెలిపారు. శుక్రవారం అండర్ పాస్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 1,500 అండర్ పాస్‌లను కేంద్ర ప్రభుత్వం నిర్మించిందన్నారు. అలుగులగూడెం అండర్‌పాస్ 250 మీటర్లు పొడవు రెండు వైపులా రక్షణ గోడలు రూ.5 కోట్లతో నిర్మించినట్టు తెలిపారు. దెందులూరు, పెదవేగి, ఏలూరు, భీమడోలు మండలాల ప్రయాణికులకు గేటు ఇబ్బందులు తొలగనున్నాయని అన్నారు. రైల్వే అధికారులు ప్రసాద్ , శ్రీనివాస్, నాగేశ్వరావు, వైఎస్సార్ సీపీ నాయకులు మోటపర్తి రాంబాబు పాల్గొన్నారు.


రైల్వే అండర్‌పాస్‌ను పరిశీలిస్తున్న అధికారులు

విద్యుత్ సమస్యల పరిష్కారమే ఫోరం లక్ష్యం

భీమడోలు: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా వినియోగదారుల గ్రీవెన్స్ ఫోరం పని చేస్తుందని ఏపీఈపీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం చైర్‌పర్సన్, రిటైర్డ్ న్యాయమూర్తి డాక్టర్ బి.సత్యనారాయణ అన్నారు. భీమడోలులోని వీసీ కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం జిల్లా స్థాయిలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం ఫోరం ఆధ్వర్యంలో బృందం సభ్యులు వినియోగదారుల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. బహిరంగ విచారణ చేసారు. ఆర్డర్లను అమలు చేయడం లేదని, నోటీసులు ఇవ్వకుండా కనెక్షన్లు రద్దు, తొలగిస్తున్నారని, వేలంలో దక్కించుకున్న గృహానికి విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడం లేదని పలువురు వినియోగదారులు ఫిర్యాదు చేశారు. ఉమ్మడి జిల్లాల్లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు, వినియోగదారులు తమ సమస్యలను లిఖిత పూర్వకంగా అందించి తమ గోడును విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా నాలుగు ప్రధాన సమస్యలు రాగా వాటిలో మూడు సమస్యలను తక్షణమే పరిష్కరించారు. మరో ఫిర్యాదును పెండింగ్‌లో ఉంచారు. సంబంధిత అధికారులు తగు సూచనలందించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.సత్యనారాయణ మాట్లాడుతూ ఏపీఈపీడీసీఎల్ పరిధిలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల్లోని విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ పంపిణీ వ్యవస్థలో సేవా లోపాలను తక్షణమే పరిష్కరించి వారికి న్యాయం చేస్తామన్నారు. ఇప్పటి వరకు ఫోరంకు వచ్చిన 7,829 కేసుల్లో 7,704 కేసులు పరిష్కరించామన్నారు. విద్యుత్ సంస్థ సేవలకు ప్రతి దానికి నిర్ణీత కాలపరిమితి ఉంటుందని, అందుకు విరుద్ధంగా సంస్థ సిబ్బంది నిర్లక్ష్య వైఖరిని అవలంభిస్తే వినియోగదారులు తమ సమస్యలను న్యాయస్థానం దృష్టికి తీసుకుని వచ్చి పరిష్కారం పొందవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు వి.జనార్ధనరావు, డాక్టర్ రాయసం సురేంద్రకుమార్, ఈఈ జేపీబీ నటరాజన్, డీఈ ఝాన్సీ, ఏడీఈ కె.గోపాలకృష్ణ, ఏఈ పి.రామస్వామి, విద్యుత్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


ఫోరం చైర్‌పర్సన్ డాక్టర్ సత్యనారాయణకు వినతిపత్రం అందిస్తున్న విద్యుత్ వినియోగదారుడు

కులగణనలో నిబంధనలు పాటించాలి

గణపవరం: రాష్ట్రంలో కులగణన సర్వే మండలంలోని చాలా ప్రాంతాల్లో ప్రభుత్వం జారీ చేసిన జీవో-17కు విరుద్ధంగా చేశారని దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని యునైటెడ్ పాస్టర్స్ యూనియన్ విజ్ఞప్తి చేసింది. శుక్రవారం యూనియన్ సభ్యులు గణపవరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు డి.విజయకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన నిబంధనల్లో వ్యక్తి తను ఆచరిస్తున్న మతాన్ని తెలియజేసినప్పుడు దానినే నమోదు చేయాలని నిబంధనలున్నప్పటికీ గ్రామ సచివాలయ సిబ్బంది దీన్ని పాటించలేదన్నారు. క్రైస్తవ మతాన్ని స్వీకరించిన చర్చి ఫాదర్లు, చర్చిలకు వెళ్లే వారందరినీ హిందువులుగా నమోదు చేశారని, ఇది నిబంధనలకు పూర్తి విరుద్ధమని అన్నారు. దీనిని సవరించాలని వారు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు అగస్టీన్, ఎం.విన్సెంట్, షాలేమ్, సోలోమన్, చిరంజీవి పాల్గొన్నారు.

ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటి సరఫరా

గణపవరం(ఉంగుటూరు): గ్రామాల్లో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడానికి తపన ఫౌండేషన్ కృషి చేస్తోందని చైర్మన్ గారపాటి సీతారామాంజనేయచౌదరి అన్నారు. శుక్రవారం ఉంగుటూరు మండలం నారాయణపురంలో తపన ఫౌండేషన్ తరపున సమకూర్చిన వాటర్ ట్యాంకర్‌ను ఆయన ప్రారంభించారు. ఏలూరు జిల్లా వ్యాప్తంగా 2008 నుంచి సుమారు 20 ట్యాంకర్ల ద్వారా గ్రామాలకు తాగునీరు అందిస్తున్నామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దిడ్ల అలకనంద శ్రీనివాస్, బీజేపీ జాతీయ మహిళామోర్చా కార్యదర్శి, ఉంగుటూరు నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీ రాణి, బీజేపీ నాయకులు నగరపు సత్యనారాయణ, అడబాల శోభారాణి పాల్గొన్నారు.

సోమవరప్పాడులో అగ్నిప్రమాదం

దెందులూరు: సోమవరప్పాడులో గురువారం రాత్రి కౌలురైతు చల్లపల్లి అమర్‌నాథ్‌కు చెందిన 18 ఎకరాల గడ్డివాము దగ్ధమైంది. విషయం తెలుసుకున్న బాధిత రైతులు ఏలూరు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్ ఆఫీసర్ రామకృష్ణ, సిబ్బంది అప్పారావు, శ్రీనివాస్, సత్యనారాయణ, ప్రసాద్, కోటేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకుని మంటలార్పే ప్రయత్నం చేశారు. ఈ ఘటనలో దాదాపు రూ.2.50 లక్షల నష్టం వాటిల్లినట్టు ఏలూరు ఫైర్ ఆఫీసర్ వివరించారు. దీనిపై విచారణ నిర్వహిస్తున్నామన్నారు.

సమస్యలపై తక్షణం స్పందిస్తాం

భీమడోలు: విద్యుత్ సమస్యను పోస్టుకార్డులో రాసి పంపినా ఫోరమ్ తక్షణమే స్పందించి పరిష్కరిస్తుందని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం చైర్‌పర్సన్ డాక్టర్ బి.సత్యనారాయణ అన్నారు. భీమడోలు శ్రీవేంకటేశ్వర డిగ్రీ కళాశాలలో శుక్రవారం విద్యార్థులు, కళాశాల అధ్యాపకులకు విద్యుత్ పంపిణీ సంస్థ పనితీరు, సమస్యలు, వాటి పరిష్కారం తదితర అంశాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ బొమ్ము రవికుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బి.సత్యనారాయణ మాట్లాడుతూ విద్యుత్ సమస్యలను పరిష్కారానికి ఫోరమ్ కృషి చేస్తుందన్నారు. సమస్యను ఓ పోస్టుకార్డుపై రాసి ఫోరమ్‌కు పంపవచ్చునని, వాట్సాప్, మెయిల్‌కు కూడా పంపవచ్చునన్నారు. టోల్ ఫ్రీ నం.1912కు ఫోన్ చేసి విద్యుత్ సమస్యలు తెలియజేయవచ్చునన్నారు. దీనిపై తమ తల్లిదండ్రులను చైతన్యపర్చాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ గృహ వినియోగదారులకు 200 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు వి.జనార్ధనరావు, రాయసం సురేంద్రకుమార్, ఈఈ జేపీబీ నటరాజన్, ఏడీఈ కె.గోపాలకృష్ణ, ఏఈ పి.రామస్వామి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



భీమడోలులో డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ డాక్టర్ బి.సత్యనారాయణ

విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించాలి

భీమడోలు: విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన లక్ష్యంగా ఉపాధ్యాయులు పని చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం అన్నారు. భీమడోలు ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల-1ను శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తొలుత ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థుల రాత పుస్తకాలను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు సంబంధించి కార్యాచరణ ప్రణాళిక, అన్ని తరగతుల పరీక్షల మార్కులను పరిశీలించి హెచ్‌ఎం బి.శ్రీనివాసరావు నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణతా సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు ఈదుపల్లి శ్రీనివాసరావు, అయినపర్తి భాస్కరకుమార్, హెచ్‌ఎంలు బి.శ్రీనివాసరావు, బి.సత్యనారాయణ పాల్గొన్నారు.


భీమడోలు-1 పాఠశాలలో విద్యార్థుల నుంచి సమాధానాలు రాబడుతున్న డీఈవో ఎస్.అబ్రహం

ఉత్తమ సమాజ స్థాపనే మానవత లక్ష్యం

భీమడోలు: ఉత్తమ సమాజ స్థాపనే లక్ష్యంగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ పని చేస్తుందని భీమడోలు ఏఎంసీ వైస్ చైర్మన్ పులిచర్ల వెంకటకృష్ణారావు అన్నారు. పూళ్ల, వడ్లపట్లలో శుక్రవారం మానవత సంస్థ ఆధ్వర్యంలో దీనస్థితిలో ఉన్న 7 కుటుంబాల వారికి నిత్యావసరాలు, ఆర్థిక సాయం అందించారు. పూళ్ల, వడ్లపట్లలోని ఆరు కుటుంబాల వారికి నిత్యవసరాలు బియ్యం, సరుకులు, నూతన వస్త్రాలను అందించారు. ప్రమాదంలో కాళ్లు విరిగిన చింతల శ్రీనివాస్‌కు సంస్థ రూ.5వేల ఆర్థిక సాయం అందించారు. సంస్థ మండల అధ్యక్షుడు వట్టి సుగుణాకర్, మండల కన్వీనర్ పంచకర్ల సత్యనారాయణ రూ.5వేల ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మండల చైర్మన్ గుల్ల నూకరాజు, మండల మాజీ అధ్యక్షుడు పచ్చా వెంకటేశ్వరరావు, గోనుగుంట రమణ శంకర్,సాంబశివరావు, యాసా వెంకట్రామయ్య, దాసరి మంగయ్య, గిరి, రాజేష్, అబ్బు లు, తాతారావు, మద్దాల జగన్నాథం పాల్గొన్నారు.


పూళ్లలో వృద్ధురాలికి నిత్యావసరాలు, వస్త్రాలు అందిస్తున్న మానవత ప్రతినిధులు